


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | గురువారం | 08-10-2026 | సంపుటి: 3 | సంచిక: 244 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 08-10-2026 | V0LUME : 3 | ISSUE : 244 | PAGES: 8 | COST: 2/- |

## ఓటు హక్కును హరించే కుట్ర..



- రేవంత్ తీవ్ర ఆరోపణలు
- ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారిగా విభజించే ప్రయత్నం
- మోదీ ఆదేశాలతోనే ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టిందని ఆరోపణ
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరిన రాహుల్‌పై చర్యలు దారుణమన్న సీఎం
- రాహుల్, ప్రియాంక, ఖర్గే అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడేనని వ్యాఖ్య

2

### రాహుల్ అరెస్టుపై రేవంత్ఆగ్రహం..
## 'ఎస్ఐఆర్ గో బ్యాక్'

- రాహుల్‌ను కలిసేందుకు బారాఖంబా పీఎస్‌కు చేరుకున్న రేవంత్
- పోలీస్ స్టేషన్ వద్దే సీఎంను అడ్డుకున్న పోలీసులు
- లాఠీచార్జ్‌లో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి గాయాలు
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం

4



# రోడ్డెక్కనున్న నేతలు

- 2027లో పాదయాత్రలకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- రాష్ట్రవ్యాప్త యాత్రకు కేటీఆర్ సన్నాహాలు
- తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి కవిత ప్రణాళిక
- సంక్షేమ పథకాల ప్రచారానికి కాంగ్రెస్ వ్యూహం
- ప్రజా సమస్యలపై పాదయాత్రలకు బీజేపీ నేతల సన్నద్ధత
- యాత్రలతో మారనున్న తెలంగాణ రాజకీయ వాతావరణం

**హైదరాబాద్, అక్టోబర్ 7:**
తెలంగాణ రాజకీయాలు వచ్చే ఏడాది నుంచి మరింతగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో ఊపందుకునే పాదయాత్రల సంస్కృతి.. 2027లోనే మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలు క్షేత్ర స్థాయిలో ప్రజల అసంతృప్తిని ప్రభుత్వంపై

మిగతా 2వ పేజీలో..

### గత పాలకుల కారణంగానే
## తీవ్ర ఆర్థిక భారం



- 'యాదాద్రి' ప్లాంటు కు బొగ్గు కేటాయింపును పట్టించుకోని గత ప్రభుత్వం
- ఈ పవర్ ప్లాంట్ నిర్మాణంతో రాష్ట్రంపై ఆర్థిక భారం
- యూనిటు రూ.6.66 పడుతున్న విద్యుత్ ధర
- బొగ్గు, నీటి వనరులున్న ప్రాంతాల్లోనే ప్లాంట్లు నిర్మించాలి
- నైనీ కోల్ బ్లాక్ కేటాయింపులపై సైతం కత సర్కార్ నిర్లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- శాశ్వత బొగ్గు లభ్యత కోసం కేంద్రానికి లేఖలు రాశామని వెల్లడి

3

### రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

3



## ట్రూ ఆఫ్ చార్జీలపై కుంటిసాకులా

- సరిగా విద్యుత్ సరఫరా చేస్తే ఎందుకు ధర్నాలు చేస్తారు?
- కరెంటు సంక్షోభానికి మీ పాలన నిర్లక్ష్యమే కారణం
- ప్రతిపక్షం ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేకపోయారు
- మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు ధ్వజం

**హైదరాబాద్, అక్టోబర్ 7:**
విద్యుత్ వినియోగదారులపై ట్రూప్ అప్ చార్జీల పేరిట రూ.5,420 కోట్ల భారం మోపడం గురించి బీఆరఎస్ ప్రశ్నిస్తే ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోవడం ప్రజా పాలన అంటారా అని బీఆరఎస్

మిగతా 2వ పేజీలో..

## ప్రభుత్వోద్యోగులకు రెండు డీఏలు మంజూరు

- ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, అక్టోబర్ 7:**
ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండు డీఏలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాక 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి

మిగతా 3వ పేజీలో..

### మహిళలకు రూ.2,500.. రెండు తులాల
## బంగారం ప్రచారం ఫేక్

- బతుకమ్మ నుంచి పథకం అమలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ వీడియో
- సీఎం రేవంత్ పేరుతో ప్రచారమైన వీడియో నకిలీదని ఫ్యాక్ట్‌చెక్
- ఏఐ టూల్స్‌తో డీప్‌ఫేక్ ఆడియో జోడించి వీడియో సృష్టించినట్లు వెల్లడి



2



## ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్

2

### దసరా పండుగకు
## 7 వేల ప్రత్యేక బస్సులు

- రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం
- ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

3





### జంతర్ మంతర్ దిశగా విపక్షాల కదం..
## రాహుల్, ప్రియాంక అరెస్టు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఇండియా కూటమి డిమాండ్
- సాగర్ రత్నలో వ్యూహాత్మక సమావేశం అనంతరం నిరసనకు తరలింపు
- జంతర్ మంతర్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన ప్రియాంక.. బలవంతంగా బస్సులోకి ఎక్కించిన పోలీసులు
- పోలీసుల తీరుపై విపక్ష ఎంపీల ఆరోపణలు.. డెరెక్ ఓబ్రెయిన్ కూడా అరెస్టు

4

## ప్రజల ఆశీర్వాదమే నా బలం.. మోదీ

- 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్న ప్రధాని
- ప్రజలు, కార్యకర్తల విశ్వాసమే తనకు అతిపెద్ద బలమని వ్యాఖ్య
- 25 ఏళ్ల ప్రస్థానాన్ని విజయంగా కాకుండా సేవగా భావిస్తున్నట్లు వెల్లడి
- 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం సాధ్యమేనని విశ్వాసం



4

# ట్రూ ఆఫ్ చార్జీలపై కుంటిసాకులా

**మొదటిపేజీ తరువాయి**

ఎల్పీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు ధ్వజమెత్తారు. ప్రజలపై మోపిన భారాన్ని ఉపసంహరించుకొని పండుగ పూట శుభవార్త చెబుతారనుకుంటే భట్టి ఉసూరుమనిపించారన్నారు. రూ.5,420 కోట్ల భారం ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తామని అధికారులతో చెప్పించడం కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. రైతులు రోడ్ల మీదకు వచ్చి కరెంట్ కోసం ధర్నాలు చేస్తుంటే కోతలే లేవు అని చెప్పడం మీకే చెల్లిందని విమర్శించారు. మీరు సక్రమంగా కరెంట్ సరఫరా చేస్తే రైతులు ఎందుకు సబ్ స్టేషన్ల ముందు వస్తారు? ఎందుకు రోడ్లపై ధర్నాలు చేస్తారు? బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడైనా ఇలా రైతులు రోడ్డెక్కారా? మీరు తెస్తానన్న అనాటి రోజులు ఇవేనా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి మాట్లాడుతుంటే సవాళ్లు విసిరన భట్టి తాము అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా ఎందుకు సమాధానం చెప్పలేదని నిలదీశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 15.02.2018 నాటి ఎఫ్.నెం.23014/1/2018సీఎల్‌డీ ప్రకారం, ఎస్సీసీఎల్ గనుల నుండి 14 ఎంటీపీఏ జి9 గ్రేడ్ బొగ్గును యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు కేటాయిస్తే కేటాయింపు లేదు అని ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎందుకు అసత్యపు మాటలు మాట్లాడారు అని ప్రశ్నించారు. ఎల్ నినో సాకు చెబుతూ యాదాద్రిలో 3000 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్లు, కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అగిన మాట నిజం కాదా? ఇది మీ పరిపాలన వైఫల్యం కాకుంటే మరేమిటి అని హరీష్‌రావు నిలదీశారు. రాష్ట్రంలో మొత్తంగా 140 మిలియన్ యూనిట్ల కెపాసిటీ ఉంటే 89 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు మీరే చెప్పారు కదా అని అడిగారు. బొగ్గు ఉన్న దగ్గరే విద్యుత్ ప్లాంట్ ఉండాలె అని చెబుతున్న మీరు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమలో నీళ్ళు, బొగ్గు లేని చోట థర్మల్ ప్లాంట్ పెట్టింది నిజం కాదా.. ఆనాడు ఎందుకు మౌనంగా ఉన్నారు అని ప్రశ్నించారు. మన రాష్ట్ర విద్యుత్ అవసరాలు పక్కన పెట్టి సింగరేణి నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను రాజస్థాన్ రాష్ట్రానికి ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నది స్వయంగా మీరు కాదా? ఇది రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీసే నిర్ణయం కాక మరేమిటన్నారు. రూపాయి పెట్టుబడి లేకుండా, తక్కువ ధరకు 1600 మెగావాట్ల విద్యుత్‌ను మన రాష్ట్రానికి ఎన్టీపీసీ సరఫరా చేస్తానన్నా దాన్ని తిరస్కరించి ఈరోజు విద్యుత్ కోతలకు కారణం అయ్యింది మీరు కాదా అని నిలదీశారు. 40లక్షల టన్నుల బొగ్గు నిల్వలు లేనివి ఉన్నట్లు చూపి ఇన్‌కం టాక్స్, కోల్ సెస్, డీఎంVఎఫ్‌టి చెల్లించి మోసం చేసింది నిజం కాదా అన్నారు. నిజంగా ఆ 40 ఆ లక్షల టన్నుల బొగ్గు ఉండి ఉంటే, ఈరోజు కరెంట్ కష్టాలు ఎందుకు ఉంటాయి అని అడిగారు. నదుల్లో నీళ్లు ఉన్నా మోటార్లు నడప నీళ్లు లిఫ్ట్ చేయక సాగు నీళ్లు అందించలేదు.. బొగ్గు నిల్వలు పెట్టుకోకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయక రైతులకు కరెంట్ సరఫరా చేయడం లేదు... మీ నిర్లక్ష్యం వల్ల సాగు నీటి కొరత, కరెంట్ కొరత వచ్చింది నిజం కాదా అని ఆయన అడిగారు. సింగరేణి సహా విద్యుత్ సంస్థలను ఐపీవో, కొత్త అప్పుల దిశగా తీసుకెళ్లేందుకు ఎనర్జీ రిఫార్మ్స్ కమిటీనీ ఏర్పాటు చేసి దానికి చైర్మHగా ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణ్యంను నియమించాలనే ప్రతిపాదన నిజమా కాదా అని నిలదీశారు. నెహ్రూ సోషలిజం పేరుతో ప్రభుత్వ రంగ స్థలం కాపాడుతున్నామని డబ్బా కొట్టుకున్న మీరు యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులంతా రోడ్డెక్కి ధర్నాలు చేసింది నిజం కాదా అన్నారు. కరెంట్ కోతలతో రైతులకు అనేక ఇబ్బందులు ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఈరోజు పత్రికా సమావేశంలో రైతుల పక్షాన, ప్రజల పక్షాన ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రెస్‌మీట్లు పెట్టి మాపై నిందలు వేసినంత మాత్రాన ప్రజల కరెంట్ కష్టాలు తీరవన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కరెంట్ కోతలు లేకుండా చూడాలని, ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై వేసిన భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని, లేదంటే బీఆరఎస్ ప్రజా పోరాటానికి సిద్ధం అవుతుందని మరోసారి స్పష్టం చేస్తున్నామని హరీష్‌రావు హెచ్చరించారు.



# ఓటు హక్కును హరించే కుట్ర..

హైదరాబాద్, అక్టోబర్ 5:

- రేవంత్ తీవ్ర ఆరోపణలు
- ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారిగా విభజించే ప్రయత్నం
- మోదీ ఆదేశాలతోనే ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టిందని ఆరోపణ
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరిన రాహుల్‌పై చర్యలు దారుణమన్న సీఎం
- రాహుల్, ప్రియాంక, ఖర్గే అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడేనని వ్యాఖ్య
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్' ఉద్యమం
- రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 7:

దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు.

**'జీకే గో బ్యాక్' ఉద్యమం**

దేశ స్వాతంత్ర్య పోరాటంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం కీలక పాత్ర పోషించిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళన ఆగదని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమం సమయంలోనూ మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని, చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనన్నారు. అవసరమైతే పరిస్థితులు మరింత ముందుకు వెళ్లి ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా రావచ్చని వ్యాఖ్యానించారు.

**ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరు**

రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ హరించలేరని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు నేరుగా ఎన్నికల సంఘాన్నే రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజల ఓట్లను తొలగించి ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని చెప్పారు. రాహుల్, ప్రియాంకల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు మోదీ, అమిత్‌షాల అసహనాన్ని చూపిస్తోందని అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పదవులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేతలపై పోలీసులను ప్రయోగిస్తున్నారని విమర్శించారు.

**ప్రజల ఉద్యమంగా కొనసాగిస్తాం**

దేశ ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని సీఎం అన్నారు. ప్రజల హక్కులను కాలరాసిన వారు చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయించాలని కేంద్రాన్ని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పని సరిగా స్పందించాల్సి ఉంటుందని, లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగి రాజ్యాంగ పరిరక్షణ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తారని రేవంత్ రెడ్డి తెలిపారు.

# ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్

హైదారాబాద్, అక్టోబర్ 7:



ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది వ్యల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది వ్యల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్‌మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ మోసగాళ్లకు వ్యల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. వ్యల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఎవరైనా మీ అకౌంట్‌ను ఉపయోగించుకోవడానికి కమీషన్ ఆఫర్ చేసినా.. ఒక్కసారి మాత్రమే అని చెప్పినా.. ఒప్పుకోకండి. ఎందుకంటే మీ అకౌంట్‌లో జరిగిన ట్రాన్సాక్షన్‌కు మీరు కూడా సమాధానం చెప్పాల్సి రావచ్చు. తెలియని లింకులపై క్లిక్ చేయకండి, ఓటీపీలు లేదా బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకండి, సోషల్ మీడియాలో వచ్చిన అకౌంట్లకు డబ్బులు పంపకండి. ఏదైనా సైబర్ మోసం జరిగితే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయండి ఫిర్యాదు చేయండి. ఈ ఆపరేషన్ చెప్పే అసలు మెసేజ్ ఒక్కటే.. ఈజీ మనీ అనిపించే ప్రతి ఆఫర్.. ఈజీ మనీ కాకపోవచ్చు. ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇవ్వడం కూడా మీ జీవితాన్ని సైబర్ క్రైమ్ కేసులోకి లాగొచ్చు.

# మహిళలకు రూ.2,500.. రెండు తులాల బంగారం ప్రచారం ఫేక్

- బతుకమ్మ నుంచి పథకం అమలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ వీడియో
- సీఎం రేవంత్ పేరుతో ప్రచారమైన వీడియో నకిలీదని ఫ్యాక్ట్‌చెక్

హైదరాబాద్, అక్టోబర్ 7:

తెలంగాణలో మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణ లక్ష్మి కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. ఈ పథకం బతుకమ్మ పండుగ నుంచి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లుగా వైరల్ అవుతున్న వీడియోలో పేర్కొన్నప్పటికీ.. అది పూర్తిగా నకిలీదని ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రానికి ఏఐ టూల్స్ ద్వారా డీప్‌ఫేక్ ఆడియో జోడించి వీడియోను రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, రెండు తులాల బంగారం అందించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు.

సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు సూచించారు. ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలకు సంబంధించి అధికారికంగా విడుదలయ్యే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- అధిక ప్రమాదాలు జరిగే తెలంగాణలోని 7 జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- 'జీరో ఫాటాలిటీ' లక్ష్యంగా '4ఈ' విధానం అమలు
- 48 ప్రమాద కారిడార్లు, 230 ప్రాధాన్య ప్రాంతాల గుర్తింపు
- ప్రతి ప్రమాదాన్ని 'ఈ-డార్'లో నమోదు చేయాలని ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 7:

తెలంగాణలో రోడ్డు ప్రమాదాల మరణాలను తగ్గించేందుకు ఏడు జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలను ఎంపిక చేశారు. 2024, 2025 గణాంకాల ఆధారంగా ఈ జిల్లాల్లో 48 ప్రమాద కారిడార్లు, నాలుగు లేదా అంతకంటే ఎక్కువ మరణాలు నమోదైన 230 ప్రాంతాలు, 220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 183 పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించారు. ప్రమాదాల నివారణకు ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అనే '4ఈ' విధానాన్ని అమలు చేయనున్నారు.

ప్రతి ప్రమాదాన్ని ఎలక్ట్రానిక్ డిజిటల్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈడార్)లో నమోదు చేయాలని రవాణాశాఖ కమిషనర్ సూచించారు. ప్రమాద ప్రాంతాలు, సమయాలు, రహదారి లోపాలను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. రాష్ట్రంలో ఏటా 7 వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతున్నారని, మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని తెలిపారు.



# రోడ్డెక్కనున్న నేతలు

**మొదటిపేజీ తరువాయి**

ఒత్తిడి పెంచేందుకు వినియోగించుకోవాలని చూస్తుండగా.. వారికి అవకాశం ఇవ్వకుండా అధికార కాంగ్రెస్ కూడా ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కేటీఆర్, కవిత యాత్రలకు సన్నాహాలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేపడతానని ఇప్పటికే ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతులు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన భావిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ఈ యాత్రను ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ చూస్తోంది.

మరోవైపు తెలంగాణ రక్షణ సేన పేరుతో సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్న కల్వకుంట్ల కవిత కూడా పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో పాటు తన పార్టీకి క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను సమీకరించేందుకు యాత్రను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయానికి పార్టీని బలోపేతం చేయడం కూడా యాత్ర లక్ష్యంగా కనిపిస్తోంది.

**బీజేపీ నేతలూ ప్రజల్లోకి..**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా పాదయాత్రల విషయంలో వెనుకబడే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు వివిధ నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ యాత్రలు చేపట్టే అవకాశం ఉంది. స్థానిక సమస్యలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, వాటి వినియోగం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా తనదైన శైలిలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ నిర్వహిస్తున్న యాత్రలతో ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో దృష్టిని ఆకర్షిస్తున్నారు.

**పాదయాత్రలతోనే రాజకీయ మైలేజ్?**

సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకతను కూడగట్టేందుకు ప్రతిపక్షాలు పాదయాత్రలను ప్రధాన సాధనంగా ఉపయోగించుకుంటాయి. అయితే ఈసారి అధికార పక్షానికి చెందిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం స్థాయి నేతలు కూడా ప్రజల్లోకి నేరుగా వెళ్లే యాత్రలు చేపడితే రాజకీయ చర్చ మరింతగా క్షేత్రస్థాయికి చేరే అవకాశం ఉంది. విపక్షాల ఆరోపణలకు అక్కడికక్కడే సమాధానం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించే అవకాశం కాంగ్రెస్‌కు లభించనుంది.

దీంతో వచ్చే ఏడాది తెలంగాణ రాజకీయాలు పూర్తిగా రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఏ పార్టీ డిజిటల్ విభాగం తన పాదయాత్రల్లోని విజువల్స్, నేతల వ్యాఖ్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నది కూడా రాజకీయ ప్రచారంలో కీలకంగా మారనుంది. ప్రతిపక్షాల ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం, అధికార పక్షం సంక్షేమ ప్రచారం మధ్య పాదయాత్రలు తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారే అవకాశముంది.

**రేవంత్ పాదయాత్రపై ప్రచారం**

విపక్షాలకు క్షేత్రస్థాయిలో రాజకీయ స్థలం దక్కకుండా కాంగ్రెస్ కూడా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ప్రజాపాలన, సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం సాధించిన ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ కూడా వేర్వేరు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# గత పాలకుల కారణంగానే తీవ్ర ఆర్థిక భారం

- 'యాదాద్రి' ప్లాంటు కు బొగ్గు కేటాయింపును పట్టించుకోని గత ప్రభుత్వం
- ఈ పవర్ ప్లాంట్ నిర్మాణంతో రాష్ట్రంపై ఆర్థిక భారం
- యూనిటు రూ.6.66 పడుతున్న విద్యుత్ ధర
- బొగ్గు, నీటి వనరులున్న ప్రాంతాల్లోనే ప్లాంట్లు నిర్మించాలి
- నైనీ కోల్ బ్లాక్ కేటాయింపులపై సైతం కత సర్కార్ నిర్లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- శాశ్వత బొగ్గు లభ్యత కోసం కేంద్రానికి లేఖలు రాశామని వెల్లడి

**హైదరాబాద్, ప్రజాతంత్ర, అక్టోబర్ 7:**

యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులో గత పాలకులు తప్పిదాలు చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నైనీ కోల్ బ్లాక్‌ను పదేళ్లపాటు గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వ్యక్తిగతంగా నైనీ కోల్ బ్లాక్‌పై సమాచారం సేకరించానన్నారు.సీఎం, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజలతో మాట్లాడి నైనీలో మైనింగ్ ప్రారంభించాం. నైనీ కోల్ బ్లాక్‌ది ఫిక్స్‌డ్ కేటగిరీ.. పవర్ ప్లాంట్లకు మాత్రమే బొగ్గు కేటాయింపు అని స్పష్టం చేశారు. నైనీ నుంచి వస్తున్న బొగ్గును యాదాద్రికి మళ్లించడం శాశ్వత పరిష్కారం కాదన్నారు. ఇతర ప్లాంట్లకు బొగ్గు కేటాయింపు జరిగే వరకు మాత్రమే యాదాద్రికి బొగ్గు వచ్చే అవకాశం. యాదాద్రికి శాశ్వత బొగ్గు కేటాయింపు కోసం కేంద్రాన్ని కోరుతున్నాం. కోల్ ఇండియాకు లేఖ రాసి బొగ్గు కేటాయింపు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా బొగ్గు కేటాయింపునకు చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర బొగ్గు కేటాయింపు కమిటీకి కూడా లేఖ రాశాం. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సైతం బొగ్గు కేటాయింపుపై లేఖ రాశాం. గత ప్రభుత్వ తప్పిదాలను అధిగమిస్తూ యాదాద్రికి బొగ్గు కోసం ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ వల్ల తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందా? యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి ధర యూనిట్‌కు రూ.6.66. కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.4.17, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.4.60. యాదాద్రి విద్యుత్ ధరే ఎందుకు ఇంత అధికమని ఆయన ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ దేశంలోనే అత్యధిక వ్యయంతో విద్యుత్ అందించే గ్రిడ్‌గా మారింది. యాదాద్రి అధిక విద్యుత్ ధర భారం అంతిమంగా వినియోగదారులపైనే వినియోగదారులు అంటే తెలంగాణ ప్రజలపైనే పడుతుందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ కారణంగా రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతున్నదన్నారు. యాదాద్రి ప్లాంట్ జీవితకాలం సుమారు 25 ఏళ్లు, ఈ ప్లాంట్ పనిచేసినంత కాలం అధిక విద్యుత్ ధర భారం తప్పదు. బొగ్గు, నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోనే పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. బొగ్గును లారీలు, రైళ్లు, ఓడల ద్వారా తరలించడం ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. విద్యుత్ గ్రిడ్ అందుబాటులో ఉన్నందున ఎక్కడ ఉత్పత్తి చేసినా వైర్ల ద్వారా విద్యుత్‌ను తరలించవచ్చు. సరైన ప్రణాళిక లేకుండా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే డిస్కమ్‌లకు నష్టమన్నారు. గత పాలకుల తప్పుడు నిర్ణయాల భారం రాష్ట్ర ప్రజలు, విద్యుత్ డిస్కమ్‌లపై పడుతుందన్నారు. ప్రతిపక్షంలో వున్నాం అని ఏది పడితే అది మాట్లాడకూడదు

**హరీశ్‌రావు వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్**

పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పకుండా.. ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని ఏదిపడితే అది మాట్లాడటం సరికాదని హరీశ్రావుకు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హితవు చెప్పారు. ఆయన మాటలు వింటే నవ్వాలో.. ఏడవాలో అర్థం కావడం లేదు. సింగరేణి బొగ్గు బ్లాకుల విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలకు డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయి. 2014-2024 మధ్య అందుబాటులో ఉన్న 14 బొగ్గు బ్లాకులను మూసేశారు. కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా పక్కన పెట్టారు. వేలంలో పాల్గొని ఉంటే కనీసం కొన్ని బొగ్గు బ్లాకులైనా సింగరేణికి దక్కేవి. 14 బొగ్గు బ్లాకులు మూతపడటంతో 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయింది. కొత్త బ్లాకులు తీసుకురాకపోయినా.. సింగరేణి తన పరిధిలో ఉత్పత్తిని పెంచింది. 2014-15లో 52.66 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2025-26లో 62.07 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. డిస్పాచ్ బొగ్గు బ్లాకులు తగ్గినా.. సింగరేణి ఉత్పత్తిని 62.07 మిలియన్ టన్నులకు పెంచింది. సింగరేణి తన వంతుగా చేయాల్సిందం తా చేస్తూ నిలబడింది. విశాఖపట్నం, కృష్ణపట్నం నుంచి బొగ్గు రవాణాపై 07122016న గత పాలకులు లేఖ రాశారు. లేఖ రాసిన తర్వాత రవాణా ఏర్పాట్లను పూర్తిగా వదిలేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌పై గత ప్రభుత్వ తప్పిదాలే రెండేళ్ల ఆలస్యానికి కారణం. 50 శాతం విదేశీ బొగ్గు.. 50 శాతం స్వదేశీ బొగ్గు వాడతామని చెప్పి పర్యావరణ అనుమతులు తీసుకున్నారు. ఆ తర్వాత 100 శాతం సింగరేణి బొగ్గు వాడతామని చెప్పి ఎన్జీటీకి వెళ్లారు. ఎన్జీటీ అనుమతులు రద్దు చేసిన తర్వాత ప్రాజెక్టుపై ఫాలోఅప్ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 2024 ఫిబ్రవరి 20న మళ్లీ పబ్లిక్ హియరింగ్ నిర్వహించాం. ఎన్జీటీ సమస్యలను పరిష్కరించి యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. రెండేళ్ల ఆలస్యమైన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అనుమతులు తీసుకువచ్చి యూనిట్లను వరుసగా కమిషన్ చేస్తున్నాం. సరిపడా బొగ్గు కేటాయింపులు లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో బొగ్గు సమీకరణ చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ముందుకు వెళ్తున్నాం. అభినందించాల్సింది పోయి హరీశ్‌రావు విమర్శలు చేయడం విడ్డూరం. మీ వల్ల జరిగిన పొరపాట్లకు ఇవన్నీ ఆధారసహిత పత్రాలున్నాయి. ఈ తప్పిదాలను వారానికి ఒకసారి ఆధారాలతో ప్రజాక్షేత్రంలో పెడతాం. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఆధారాలతో ఎండగడతాం. పది సంవత్సరాల పాలనలో ఏం చేశారో హరీశ్‌రావు సమాధానం చెప్పాలి. ప్రతిపక్షంలో ఉన్నామనే కారణంతో బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

# ఘనంగా సారస్ మేలా ప్రారంభం

- పల్లె ఉత్పత్తులకు పట్టం కట్టిన సారస్
- నగర మార్కెట్‌తో అనుసంధానం
- 20కి పైగా రాష్ట్రాల నుంచి 200కు పైగా స్టాళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 7:**



నగరంలో గ్రామీణ భారతదేశపు కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో సారస్ మేలా బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఒకవైపు హస్త కళల చేతివృత్తులు, మరోవైపు తెలంగాణ సంప్రదాయ వంటకాలు, తిరునల్వేలి హల్వా, ఈశాన్య రాష్ట్రాల మోమోలు, ఇతర రాష్ట్రాల రుచులు, పేరిణి నృత్యం, శివతాండవం వంటి తెలంగాణ నృత్యాలు, పల్లె పదాలు, జానపద పాటల మధ్య మొదలైంది. ప్రారంభ సూచకంగా సెర్ప్ డైరెక్టర్లతో కలిసి సీఈఓ దివ్య దేవరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో 18వ తేదీ వరకు జరిగే ఈ మేలాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను నగర మార్కెట్‌కు అందుబాటులోకి తెచ్చే విధంగా సారస్ ఫెయిర్ కొనసాగుతోంది. ఈసారి 200కు పైగా స్టాళ్లలో చేనేతలు, హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, హెర్బల్ ఉత్పత్తులు, గ్రామీణ తయారీ వస్తువులు, లైవ్ ఫుడ్ అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ నుంచి 95 స్టాళ్లు ఏర్పాటు కాగా, ఇతర రాష్ట్రాల నుంచి 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మరో 43 స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలతో పాటు చెక్క బొమ్మలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, బంజారా కళాకృతులు, ఎంబ్రాయిడరీ, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయి. ఈ మేలా కేవలం కొనుగోలు, విక్రయాలకు పరిమితం కాకుండా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యక్ష మార్కెట్ అనుభవాన్ని అందించే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ధరలు, ప్యాకేజింగ్, ఉత్పత్తుల నాణ్యతపై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం లభిస్తోంది. తద్వారా భవిష్యత్‌లో బల్క్ ఆర్డర్లు, మార్కెట్ లింకేజీలు, వ్యాపార అవకాశాలకు మార్గం ఏర్పడనుంది. మేళాలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

మొదటిరోజు శివతాండవం పేరిణి నృత్యం హైలెట్‌గా నిలిచాయి. 12వ తేదీన బతుకమ్మ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. మంత్రి సీతక్కతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు

**గిరిజన ఆభరణాలతో సారిక ప్రత్యేక ఆకర్షణ**

సారిక ముడావత్ (35) గిరిజన ఆభరణాల తయారీతో కనుమరుగవుతున్న కళారూపానికి జీవం పోస్తున్నారు. ఈ మేలాలో ప్రతి ఏడాది కనీసం రూ.లక్ష ఆదాయం ఆర్జిస్తున్నానని ఆమె తెలిపారు. గత నాలుగేళ్లుగా సారస్ మేళాలో పాల్గొంటున్న సారిక, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో గిరిజన ఆభరణాల తయారీ, విక్రయాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుంటున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలైన సారిక ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

**చెరియాల్ మాస్కులతో సంప్రదాయ కళకు ఆధునిక హంగులు**

మంగా పసుల (40) చెరియాల్ మాస్కులు, వాల్ డెకార్ తయారు చేస్తున్నారు. కలప, చింతగింజల మిశ్రమంతో రూపొందించే ఈ కళాఖండాలు జానపద నాటక సంప్రదాయాలను ఆధునిక ఇంటీరియర్లకు చేరువ చేస్తున్నాయి. చెరియాల్ చిత్రకళా సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ప్రకాశవంతమైన రంగులు, కథనాత్మక రూపాలు, భావోద్వేగాలను పలికించే ముఖ కవళికలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. గిఫ్ట్‌గా ఇచ్చేందుకు అనువుగా చిన్న సైజు ఫ్రేమ్‌లను కూడా తయారు చేస్తున్నామని మంగా తెలిపారు. గుజరాత్ నుంచి వచ్చి ఖద్దీ ఉత్పత్తుల విక్రయం గుజరాత్‌కు చెందిన రంజన్ పర్మార్ (45) సారస్ మేళాలో చేతితో తయారు చేసిన ఖద్దీ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కుషన్ కవర్లు, బ్యాగులు, దుస్తులు తదితర అనేక రకాల ఉత్పత్తులు ఆమె స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని రంజన్ తెలిపారు. మేళా ద్వారా మంచి అమ్మకాలు సాధించి, జ్ఞాపకాలతో పాటు ఆదాయంతో స్వస్థలానికి తిరిగి వెళ్తామనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. జనగామకు చెందిన రామలక్ష్మి మసురం (35) చేతితో తయారు చేసిన ఇకత్ వస్త్రాలను మేళాలో ప్రదర్శిస్తున్నారు. భర్త సహకారంతో దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోల్లో పాల్గొంటూ తెలంగాణకు చెందిన హస్తకళా, చేనేత ఉత్పత్తులను వివిధ ప్రాంతాలకు పరిచయం చేస్తున్నారు. స్వచ్ఛమైన కాటన్ హ్యాండ్‌లూమ్, కొత్త డిజైన్లతో కూడిన సరసమైన ధరల ఉత్పత్తులు, ప్రింటెడ్ చీరలు, ప్రింటెడ్ తెల్ల చీరలు, బెడ్‌షీట్లు, టవల్స్, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బ్లౌజులు తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. స్టాల్ ఏర్పాటుకు ఎలాంటి రుసుము వసూలు చేయకపోవడంతో ఇది తమకు ఎంతో లాభదాయకమైన వ్యాపార అవకాశంగా మారిందని రామలక్ష్మి తెలిపారు.

# దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, అక్టోబర్ 7:**

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ( టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు), ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పందల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జిలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరాకు నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

# రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, ప్రజాతంత్ర, అక్టోబర్ 7 :**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ, విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వోద్యోగులకు రెండు డీఏలు మంజూరు

**మొదటిపేజీ తరువాయి**

పెంచింది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏ 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ అక్టోబర్ జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది.

# తరగతి గదిలోనే చిన్నారి.. తాళం వేసిన సిబ్బంది

- కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం
- హెచ్‌ఎం సస్పెన్షన్

**ఆదిలాబాద్, అక్టోబర్ 7 :**

తానూర్ మండలంలోని బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ సమయం ముగిసిన తర్వాత రెండో తరగతి విద్యార్థిని తరగతి గదిలోనే ఉండిపోయింది. ఈ విషయాన్ని గుర్తించకుండానే సిబ్బంది తరగతి గదికి తాళం వేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయురాలు డి. స్వప్నను సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన స్కావెంజర్ను సైతం విధుల నుంచి తొలగిస్తూ చర్యలు చేపట్టారు. పాఠశాల ముగిసే సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా బయటకు వెళ్లారా లేదా అనేది ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధా రించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.



# సామాజిక బహిష్కరణలపై బీసీ కమిషన్ కు ఫిర్యాదులు

- విజ్ఞాపనలు సమర్పించిన బాధితులు

**నిజామాబాద్, అక్టోబర్ 7 :**

సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి లతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్లోని కలెక్టరేట్లో బాధితులతో భేటీ అయ్యింది. ఐ.డీ.ఓ.సీకి చేరుకు న్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి. భుజంగ రావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాప నలు సమర్పించారు. బాధితులు నిర్భీతితో, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలు గా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధు లు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

రాజముద్ర తెలుగు దిన పత్రిక



## రాహుల్ అరెస్టుపై రేవంత్ ఆగ్రహం.. 'ఎస్ఐఆర్ గో బ్యాక్'

- రాహుల్‌ను కలిసేందుకు బారాఖంబా పీఎస్‌కు చేరుకున్న రేవంత్
- పోలీస్ స్టేషన్ వద్దే సీఎంను అడ్డుకున్న పోలీసులు
- లాఠీచార్జ్‌లో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి గాయాలు
- ఎస్ఐఆర్ రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం
- ఈడీ, సీబీఐ తరహాలో ఈసీని రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్నారని ఆరోపణ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ఢిల్లీలో విపక్షాల ఆందోళనలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు బారాఖంబా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాహుల్‌ను కలిసేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే పోలీస్ స్టేషన్ వద్దే పోలీసులు సీఎంను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

మరోవైపు బ్రిటీష్ కౌన్సిల్ సమీపంలో నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి లాఠీ దెబ్బలు తగిలి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం**

రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓట్ల అక్రమాలు, ఓటర్ల నమోదు ప్రక్రియలో అవకతవకలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వందేళ్ల క్రితం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని గుర్తుచేసిన సీఎం.. ఇప్పుడు కేంద్రం తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా అదే స్థాయిలో 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని పేర్కొన్నారు.

**ఈసీని రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్నారంటూ ఆరోపణ**

రాహుల్ గాంధీ అరెస్టుతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాల అసహనం బయటపడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలను వేధించేందుకు ఇప్పటివరకు ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఇప్పుడు స్వతంత్ర వ్యవస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- 'జంబో హైక' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతోపాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జూలైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

మరోవైపు డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని స్పష్టం చేశారు. ఇటీవలి ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తు చేసింది.

## జంతర్ మంతర్ దిశగా విపక్షాల కదం.. రాహుల్, ప్రియాంక అరెస్టు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఇండియా కూటమి డిమాండ్
- సాగర్ రత్నలో వ్యూహాత్మక సమావేశం అనంతరం నిరసనకు తరలింపు
- జంతర్ మంతర్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన ప్రియాంక.. బలవంతంగా బస్సులోకి ఎక్కించిన పోలీసులు
- పోలీసుల తీరుపై విపక్ష ఎంపీల ఆరోపణలు.. డెరెక్ ఓబ్రెయిన్ కూడా అరెస్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనతో దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీతో పాటు విపక్ష ఎంపీలు నిరసనకు దిగారు.

సాగర్ రత్న రెస్టారెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలు సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించి బస్సుల్లో అక్కడికి బయలుదేరారు. అయితే జనపథ్ ప్రాంతంలోనే ఢిల్లీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే విపక్ష నేతలు నిరసనకు దిగారు.

జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో రాహుల్ గాంధీతో పోలీసులు చర్చలు జరిపారు. మరోవైపు ప్రియాంకాగాంధీ రోడ్డుపై కూర్చుని, అనంతరం పడుకుని నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి తరలించారు. ఈ సమయంలో కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

పోలీసులు తమపై బలప్రయోగం చేశారని ఇండియా కూటమి ఎంపీలు ఆరోపించారు. రాహుల్ గాంధీతో పాటు టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోసం పోరు.. విడుదలైన రాహుల్, ప్రియాంక

- ఎస్ఐఆర్, ఈసీ పనితీరుకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆందోళన
- జంతర్ మంతర్ మార్చ్‌ను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- బారాఖంబా రోడ్ సహా పోలీస్ స్టేషన్లకు తరలింపు.. కాసేపటికి విడుదల
- రాజ్యాంగ ప్రతితో రోడ్డుపై బైఠాయించిన ప్రియాంకాగాంధీ
- అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనలకు పిలుపు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు చేపట్టిన ఆందోళన ఢిల్లీలో ఉద్రిక్తతకు దారితీసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ జంతర్ మంతర్ వైపు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా సహా పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బారాఖంబా రోడ్ సహా పలు పోలీస్ స్టేషన్లకు తరలించిన అనంతరం వారిని విడుదల చేశారు.





**వ్యవస్థలను కాపాడేందుకు పోరాటం**

విడుదలైన అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వ బెదిరింపులకు, పోలీసుల అణచివేతకు తాము భయపడేది లేదన్నారు. దేశంలోని అత్యంత పవిత్రమైన వ్యవస్థను కాపాడుకునేందుకే ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోక్యంతో దేశంలోని వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని రాహుల్ ఆరోపించారు.

**రాజ్యాంగ ప్రతితో ప్రియాంక నిరసన**

పోలీసులు తమను అడ్డుకోవడంతో ప్రియాంకా గాంధీ వాద్రా విండ్సన్ సర్కిల్ వద్ద రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని రోడ్డుపై బైఠాయించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆమె విమర్శించారు. అనంతరం మహిళా పోలీసుల సహాయంతో ప్రియాంకతో పాటు ఇతర నేతలను అక్కడి నుంచి బలవంతంగా తరలించారు.

**మరిన్ని ఆందోళనలకు పిలుపు**

ఈ పరిణామాల నేపథ్యంలో సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ), పలు విద్యార్థి సంఘాలు అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద మరింత పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టేందుకు పిలుపునిచ్చాయి.

## ప్రజల ఆశీర్వాదమే నా బలం.. మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ప్రజల ఆశీర్వాద బలమే తనను 25 ఏళ్లుగా నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో ఇంత సుదీర్ఘకాలం ప్రజాసేవ చేసే అవకాశం వస్తుందని తాను ఊహించలేదని తెలిపారు. ఇన్నేళ్లుగా తనకు అండగా నిలిచిన దేశ ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాసేవకు భగవంతుడు తనకు శక్తిని ఇచ్చారని మోదీ అన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానని తెలిపారు. తాను ఎప్పటికీ విద్యార్థిగానే ఆలోచిస్తానని, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయబోనని, సేవా మార్గంలో వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు.

**25 ఏళ్ల ప్రస్థానం.. సేవగా భావిస్తున్నా**

తన దృష్టిలో ప్రజలే దేవుని స్వరూపమని మోదీ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, పార్టీ కార్యకర్తల అవిశ్రాంత శ్రమ తనకు అతిపెద్ద బలమని చెప్పారు. 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని విజయంగా కాకుండా సేవగా భావిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత ఆశయం కోసం కాకుండా ఒక లక్ష్యం కోసం జీవితాన్ని అంకితం చేయాలన్నదే తన ఉద్దేశమని వివరించారు.

**వికసిత్ భారత్ లక్ష్యంగా..**

2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం సాధ్యమేనని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంతో పాటు దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయగలమని అన్నారు. భారత్ అభివృద్ధే తన జీవిత ఆశయమని, ఈ క్రమంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటానని తెలిపారు. సంకల్ప బలం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు.

**భారత్ వైపు ప్రపంచం చూపు**

ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోందని మోదీ అన్నారు. దేశ అభివృద్ధికి ఇది సరైన సమయమని, అన్ని రంగాల్లో నూతన ఆవిష్కరణలకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు వాటికి పరిష్కార మార్గాలను కూడా అన్వేషించవచ్చని చెప్పారు. భారత్ అభివృద్ధి దిశగా వేగంగా సాగుతోందని, ఆ ప్రయాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు.

**భద్రతకు ప్రాధాన్యం**

దేశ భద్రత అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. ఒకప్పుడు ఉగ్రవాదం దేశానికి పెనుముప్పుగా మారిందని అన్నారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు భారత్ ఎలా ప్రతిఘటించగలదో ప్రపంచానికి చూపించామని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, కార్యకర్తల కృషి, దేశ సేవ పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతానని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి, భద్రత, స్వావలంబన దిశగా మరింత వేగంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

### అద్వానీని కలిసిన మోదీ.. ఆశీర్వాదం తీసుకున్న ప్రధాని

- అద్వానీ నివాసానికి వెళ్లిన ప్రధాని.. ఆరోగ్యంపై ఆరా
- బీజేపీ అగ్రనేతతో మోదీ భేటీ.. సోషల్ మీడియాలో వైరల్‌గా ఫొటోలు
- ప్రభుత్వాధినేతగా మోదీకి 25 ఏళ్లు పూర్తి
- 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా ప్రమాణం
- 25 ఏళ్ల ప్రయాణం ఆత్మస్తుతికి కాదు.. కృతజ్ఞతలు తెలిపే సందర్భమన్న మోదీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీని ఆయన నివాసంలో కలిశారు. అద్వానీ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన మోదీ.. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. మోదీ ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అద్వానీని కలిసినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోదీ 2001 అక్టోబర్ 7న తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. 25 ఏళ్లుగా నిరంతరం ప్రభుత్వాధినేతగా కొనసాగుతున్నారు.

**కృతజ్ఞతలు తెలిపే సందర్భం**

25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై మోదీ స్పందిస్తూ.. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తాను ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడూ ఊహించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవా ప్రస్థానం ప్రజల నిరంతర ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని అన్నారు. ఇది ఆత్మస్తుతికి సందర్భం కాదని, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసే తరుణమని మోదీ పేర్కొన్నారు.

## కూటమి నిరసనకు ఎస్పీ దూరం.. కాంగ్రెస్‌తో ముదిరిన విభేదాలు

- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి భారీ ఆందోళన
- రాహుల్, ప్రియాంకతో పాటు విపక్ష ఎంపీల అరెస్టు
- నిరసనలకు దూరంగా అఖిలేశ్ యాదవ్.. ఢిల్లీలో కనిపించని ఎస్పీ నేతలు
- 150 సీట్ల కోసం కాంగ్రెస్ ఒత్తిడి.. 50కి మించి ఇవ్వలేమంటున్న ఎస్పీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**

ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసనకు సమాజ్‌వాదీ పార్టీ దూరంగా ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్, ఇతర విపక్ష ఎంపీలు జంతర్ మంతర్ వైపు తరలివెళ్లగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. అయితే ఈ ఆందోళనలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొనలేదు. ఆ పార్టీకి చెందిన నేతలు కూడా ఢిల్లీలో నిరసనల్లో కనిపించలేదు.

**లంచ్ మీటింగ్‌పై భిన్న వాదనలు**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన లంచ్ సమావేశానికి తమకు సమాచారం లేదని తొలుత కొందరు ఎస్పీ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నుంచి తమకు ప్రత్యేకంగా ఆహ్వానం అందలేదని మరో వర్గం తెలిపింది. అయితే ఈ వాదనలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఖండించారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలను లంచ్‌కు ఆహ్వానించామని, అయితే మంగళవారం రాత్రి ఆలస్యంగా కార్యక్రమాన్ని ఖరారు చేయడంతో కొన్ని పార్టీలు హాజరు కాలేకపోయాయని ఆయన వివరించారు.

**సీట్ల పంపకంపై పంచాయతీ**

2027 ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్, ఎస్పీల మధ్య సీట్ల పంపకం అంశం విభేదాలకు దారితీస్తోంది. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 150 సీట్లు తమకు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు ఎస్పీపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనికి ఎస్పీ నేతలు కాంగ్రెస్‌కు 50 సీట్లకు మించి ఇవ్వడం సాధ్యం కాదని బహిరంగంగానే చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచిస్తున్నారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు కారణంగానే కాంగ్రెస్‌కు ఆరు ఎంపీ సీట్లు దక్కాయని ఎస్పీ నేతలు పేర్కొంటున్నారు.

# 'నేనున్నా.. మేనేజ్ చేస్తా'.. గల్లీ నేత అండతో అక్రమార్కుల బరితెగింపు !

## టౌన్ ప్లానింగ్ అధికారుల కళ్లముందే బహుళ అంతస్తుల నిర్మాణం..


రాజముద్ర
భారీ సెల్లార్లు..
అక్రమ బహుళ అంతస్తులు..?



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆల్విన్ కాలనీ పరిధిలోని విజయనగర్ కాలనీ పైప్‌లైన్ రోడ్డులో నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా సాగుతున్న భారీ బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కనీసం ఒకటి లేదా రెండు అంతస్తులకే అనుమతి వచ్చే చిన్న స్థలంలో భారీగా సెల్లార్ తవ్వి, ఆపై బహుళ అంతస్తులను నిర్మిస్తున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ విభాగం ఏమాత్రం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పార్టీ కండువా అడ్డం..**
**'నేను మేనేజ్ చేస్తా' అంటూ భరోసా!**

ఈ అక్రమ నిర్మాణాల వెనుక స్థానికంగా అధికార పార్టీ పేరు చెప్పుకుని తిరిగే ఒక గల్లీ లీడర్ హస్తం ఉన్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. "టౌన్ ప్లానింగ్ అధికారులైనా, మరెవరైనా నేను చూసుకుంటా.. అంతా నేను మేనేజ్ చేస్తా.. మీ పని మీరు కానివ్వండి" అంటూ సదరు నాయకుడు బిల్డర్లకు పూర్తిస్థాయిలో కొండంత అండగా నిలుస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ అండదండలు, సదరు నేత అభయహస్తం ఉండటంతో నిర్మాణదారులు స్థానిక ప్రజల అభ్యంతరాలను గానీ, చట్టపరమైన నిబంధనలను గానీ ఏమాత్రం లెక్కచేయకుండా బరితెగించి పనులు సాగిస్తున్నారు.

### 'హైడ్రా' రంగంలోకి దిగాల్సిందే!

క్షేత్రస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు గల్లీ లీడర్ల ఒత్తిళ్లకు తలొగ్గి లేదా ముడుపుల మత్తులో జోగుతూ అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు 'హైడ్రా' బృందం వెంటనే రంగంలోకి దిగి, ఈ అక్రమ కట్టడాన్ని సీజ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్లతో పాటు వారికి వత్తాసు పలుకుతున్న స్థానిక నాయకుడు, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

**ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?**

గతంలో పలుచోట్ల ఇలాంటి అక్రమ కట్టడాలు కూలి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా వచ్చి పరిశీలనల పేరిట మొసలి కన్నీరు కార్చడం పరిపాటిగా మారింది. ప్రమాదం జరిగాక నివేదికలు రాయడం కాదు.. నిర్మాణం ప్రారంభ దశలోనే ఉన్నప్పుడు అడ్డుకోకపోతే ప్రాణ, ఆస్తి నష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు మండిపడుతున్నారు.

# 28న "జర్నలిస్టుల ఛలో ఢిల్లీ" - జంతర్ మంతర్ లో ఒక రోజు నిరసన

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజె) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం "జర్నలిస్టుల రక్షణ చట్టం" అమలు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 28వ తేదీన "ఛలో ఢిల్లీ" కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఎఫ్ డబ్ల్యూ జే వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జె ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆ రోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వందలాది మంది జర్నలిస్టులతో ఢిల్లీలోని




జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టి డబ్ల్యూ జె ఎఫ్ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలన్న ఐఎఫ్ డబ్ల్యూ జే దీర్ఘకాలిక డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అదే విధంగా సీనియర్ జర్నలిస్టుల కోసం జాతీయ పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ దీర్ఘకాలిక డిమాండ్ల సాధనకై 28న తలపెట్టిన "ఛలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్ కు వినతి**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా శాఖ డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని ఇన్ వార్డ్ సెక్షన్ లో కమిటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కాసోజు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ సుధగాని మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులు, విధవలు, ఒంటరి మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అనేకమంది అర్హత


సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ
ఖమ్మం జిల్లా
ఫిర్యాదు / వినతిపత్రం



కలిగి ఉన్నప్పటికీ ఇప్పటికీ పింఛన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి గతంలో అర్హుల జాబితాలో పేర్లు ఉన్నా పింఛన్లు నిలిపివేశారని, మరికొందరి దరఖాస్తులు గ్రామ స్థాయిలోనే పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు.

**కమిటీ ప్రధాన డిమాండ్లు**

1. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి అర్హుల జాబితా తయారు చేయాలి.
2. గతంలో దరఖాస్తు చేసుకుని ఇంకా పింఛన్ రాని వారి అర్జీలను వెంటనే పరిశీలించి మంజూరు చేయాలి.
3. అనర్హులకు ఇస్తున్న పింఛన్లను రద్దు చేసి నిజమైన అర్హులకు అందించాలి.
4. తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలి.సామాజిక న్యాయం దిశగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ అందేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# బిజెపిలో చేరిన పొద్దుటూరు గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు

**హాజరైన జిల్లా బిజెపి అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎంకేపల్లి మాణిక్యం బుధవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాములు గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, ఆధ్వర్యంలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, దేశహితం, ధర్మ




పరిరక్షణ విధానాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మాణిక్యం చేరికతో పొద్దుటూరు గ్రామంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నేషనల్ నెంబర్ ఎల్ ప్రభాకర్ రెడ్డి, శంకర్ పల్లి మండల అధ్యక్షులు లీలావతి బయానంద్, బీజేవైఎం అధ్యక్షులు కందూరి హరి కృష్ణ గౌడ్, సీనియర్ నాయకుడు పట్నం మోహన్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ పులకండ్ల రఘుపతిరెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఏనుగు సంజీవరెడ్డి, మండల బీజేపీ సెక్రటరీ పులకండ్ల గోపాల్‌రెడ్డి, పొద్దుటూరు 7వ వార్డు మెంబర్ సింహం రాజు, గ్రామ సీనియర్ నాయకులు ఎంకేపల్లి రామచంద్రయ్య, మేకల బలవంత్‌రెడ్డి, ఏనుగు గోవర్ధన్‌రెడ్డి, మేకల పాపిరెడ్డి, గౌండ్ల నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్ బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలు, మందుల లభ్యత, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, మందులు ఇతర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## పీఎం కిసాన్ సంగోష్ఠి - సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి గ్రామంలో బుధవారం ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (IPL) ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సంగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఈ. రాజేశ్ హాజరయ్యారు. వ్యవసాయ అధికారి ఎం. రాధా, ఐపీఎల్ స్టేట్ హెడ్ సాగర్ ప్రకాశ్ ఖోట్, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ మురళీధరన్, ఖమ్మం సేల్స్ ఆఫీసర్ శైలేంద్ర, నితిన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులు ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని పంట దిగుబడిని మెరుగుపరచుకోవచ్చని సూచించారు. వేప పూత యూరియా, నానో ఎరువులు, పీడీఎం (పిడిఎం), సేంద్రియ ఎరువులను పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా వినియోగించాలని రైతులకు అవగాహన కల్పించారు.

## ఛాతీ తెరవకుండానే చీలిన రక్తనాళానికి స్టెంట్ - కిమ్స్ వైద్యుల అరుదైన చికిత్స



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** గుండె ప్రధాన రక్తనాళం (అయోర్టా) చీలిన 61 ఏళ్ల వ్యక్తికి కిమ్స్ కొండాపూర్ వైద్యులు ఛాతీ తెరవకుండానే విజయవంతంగా చికిత్స అందించారు. కర్నూలుకు చెందిన కేశవరెడ్డి ఛాతీనొప్పితో ఆసుపత్రికి రాగా.. సీటీ యాంజియోగ్రామ్ లో టైప్–బి అయోర్టిక్ డిసెక్షన్ గా గుర్తించారు. చీలిక ఎడమ సబ్ క్లేవియన్ ధమని దగ్గర ఉండటంతో వైద్యులు తేవర్ పద్ధతిని ఎంచుకున్నారు. వాస్కులర్ సర్జన్ డాక్టర్ నిషాన్ రెడ్డి, డా. వెంకన్న చౌదరి, డా. మీనారెడ్డి బృందం స్థానిక మత్తుతోనే ప్రత్యేక ఫెనెస్ట్రేషన్ స్టెంట్ అమర్చి చీలికను మూసివేశారు. దీంతో చేతికి రక్తప్రసరణకు ఎలాంటి ఆటంకం కలగలేదు. చికిత్స అనంతరం రెండో రోజే రోగి నడిచి ఇంటికి వెళ్లారు. పెద్ద శస్త్రచికిత్స లేకుండానే కోలుకోవడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## చేవెళ్ల బస్టాండ్‌లో టిఆర్ పి ఆర్టీసీ ఎన్నికల ప్రచారం...

**పాల్గొన్న చేవెళ్ల టిఆర్ పి నాయకులు...**

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల బస్టాండ్‌లో తాండూరు, వికారాబాద్, పరిగి ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ముద్దెంగూడెం జనార్ధన్ ముదిరాజ్, చేవెళ్ల మండల కమిటీ అధ్యక్షులు కూనుకుర్తి అశోక్ అడ్వకేట్ తో పాటు



పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎన్నికలకు సంబంధించిన అంశాలను డ్రైవర్లు, కండక్టర్లకు వివరించి, తమ అభ్యర్థిత్వానికి సంబంధించిన ప్రచారం నిర్వహించారు.

## బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితికి బ్రదర్ షఫీ మద్దతు

**నల్గొండ–ఖమ్మం–వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి బ్రదర్ షఫీ**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన కోసం చేపడుతున్న ఉద్యమానికి ఏకం భారత్ పార్టీ నల్గొండ–ఖమ్మం–వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి బ్రదర్ షఫీ మద్దతు తెలిపారు. ఈ



సందర్భంగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి ప్రతినిధులతో ఆయన మాట్లాడి, ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు ద్వారా నల్గొండ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలకు ప్రయోజనం చేకూరే అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, వేగవంతమైన రవాణా సౌకర్యాల కోసం ప్రజల తరఫున చేపట్టే కార్యక్రమాలకు సహకరిస్తామని బ్రదర్ షఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి నాయకులు,ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బోరిగాం పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** ప్రభుత్వం అందజేస్తున్న టై, బెల్టులను బుధవారం మండలంలోని బోరిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్ పాల్గొని విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విద్యపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు గ్రామస్తులు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, గ్రామ యువకులు రాజేష్, నరేష్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరభ్యాసం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** పోషణ మాసం సందర్భంగా తాండూర్ సెక్టార్ లోని అచలాపూర్-1 అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచలాపూర్ గ్రామ సర్పంచ్ ఎం. స్రవంతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పిల్లలందరి బరువులు చూసి ఆరోగ్య స్థితి గురించి తల్లులకు సూచిరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యులు పోషయ్య, దాగం పాపయ్య, కొంచెం కళావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి, ఆశా కార్యకర్తలు, నర్సు మంజుల అంగన్వాడి టీచర్స్ మల్లు బాయి, అర్చన, అమృత, సునీత, కౌసల్య, గోపమ్మ, రమ్య,హెల్పర్స్, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## కోనేరు కోనప్ప జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్నగర్ పట్టణంలో బుధవారం కోనేరు అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన నాయకులు, కార్యకర్తలు అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కోనేరు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ సర్పంచ్ తల్లి మృతి పట్ల సుగుణ సంతాపం



**రాజముద్ర న్యూస్, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని కాశీప టేల్గూడకు చెందిన జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ తల్లి కొడప మాన్కుబాయి అ నారోగ్య ృంతో మ ృతిచెందారు. ఆమె మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కొడప ప్రకాష్ నివాసానికి వెళ్లి మాన్కుబాయి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాన్కుబాయి మృతి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాన్కుబాయి పార్థివదేహానికి నివాళులర్పించారు.

# టీసీ ఇవ్వకుండా విద్యార్థినిని వేధిస్తున్న ప్రైవేట్ కాలేజీ

**అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఫీజులు చెల్లించినా ట్రాన్స్ ఫర్ సర్టిఫికేట్ ఇవ్వకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఓ విద్యార్థిని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది.ఖమ్మం పట్టణానికి చెందిన దాసరి దీపిక తన ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం, తాను 2021లో ఖమ్మంలోని పులిపాటి ప్రసాద్ జి ఎన్ ఎం నర్సింగ్ కాలేజీలో జాయిన్ అయ్యింది. మొదటి సంవత్సరం ఫీజు పూర్తిగా చెల్లించింది. అయితే రెండవ సంవత్సరంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలో ఆపేసింది. చదువు మానేసినప్పటికీ కాలేజీ యాజమాన్యం తన ఒరిజినల్ సర్టిఫికేట్లు – టెన్త్, ఇంటర్ మెమోలు, టీసీ ఇవ్వకుండా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. 4వ సెమిస్టర్ నుండి 5వ సెమిస్టర్ వరకు ఫీజుతో పాటు పెనాల్టీ కట్టాలని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపింది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఫీజు కట్టలేకపోతున్నానని, తన సర్టిఫికేట్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.ఈ కార్యక్రమంలో గోకినపల్లి మస్తాన్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు, పడిశాల మధుసూదన్ రావు, దుమాల నాగరాజు, ఖమ్మం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు దుస్తుల పంపిణీ - స్వర్ణ VO అధ్యక్షురాలు మామిడి తిరుపతమ్మ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డిపాలెం ఎస్సీ, బీసీ కాలనీలో గల ఎన్ఎస్పీ పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణ VO అధ్యక్షురాలు, ఏపీఎంసీ చైర్మన్ మామిడి తిరుపతమ్మ, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు విద్యార్థులకు రెండు జతల దుస్తులు, బెల్టులు, షూస్, సాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మామిడి తిరుపతమ్మ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని అన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం, రాగి జావ, రెండు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని, విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.మండల విద్యాశాఖాధికారి చలపతిరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, పేద విద్యార్థుల కోసం హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ(బోథ్):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు బుధవారం బోథ్ రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై, ఎస్ఐఆర్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఎస్ఐఆర్ సమన్వయకర్త పసుల చంటి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న నోటీసులను తక్షణమే అందించాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటు హక్కు కల్పించడం కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఓటరు తొలగింపు ప్రక్రియలో ఫారం-7 ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బిఎల్ఎల సమక్షంలో చనిపోయిన వారి ఓట్లు మాత్రమే తొలగించాలని, మ్యాపింగ్ కానీ, అందుబాటులో లేని ఓటర్లకు అన్ని పార్టీల బిఎల్ఎల సహాయంతో గడపగడపకు తిరిగి నోటీసులు అందించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా తీసుకువచ్చిన నూతన ఎన్నికల సంస్కరణలను రద్దు చేయాలని, ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన 13 కోట్ల ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని, ఫారం నెంబర్ 6 పాత పద్ధతిలోనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు ద్వారా విచారణ ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, తలమడుగు మండల అధ్యక్షుడు కస్తాల ప్రతాప్, సీనియర్ నాయకులు వార్డ్ మెంబర్ షేక్ షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకోం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** దళితులను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. బుధవారం మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఆయన భార్య, అంగన్వాడీ టీచర్ మీనాను పరామర్శించారు. గత సోమవారం అంగన్వాడీ టీచర్ మీనాపై ఐసీడీఎస్ పీడీ రవూఫ్ఖాన్ దర్యాప్తు పేరుతో ఒత్తిడి, భయాందోళనలకు గురిచేయడాన్ని ఖండించారు. దీనిపై సంబంధిత అధికారి వివరణ అందుబాటులో లేదని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా సమగ్ర విచారణ నిర్వహించకుండా సర్పంచ్, ఆయన భార్యపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనం, అద్దెకు సంబంధించిన అంశాలు, కేంద్రంలోని లబ్ధిదారుల పరిస్థితులు, సిబ్బంది విధులకు హాజరవుతున్న తీరుపై సమగ్రంగా విచారణ జరిపారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారి తన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈఐసీడీఎస్ పీడీపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పిదాలు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, మండల ఇన్చార్జి జిలకర శంకర్, కాసిపేట కృష్ణ, ఆయిల్ల గణేష్, మాదారం పట్టణ అధ్యక్షుడు సముద్రాల ఆనంద్, తరంగ్ అశోక్, రాము, ఆసంపల్లి శ్రీనివాస్, ఏ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి సమన్వయంతో ప్రజా అభివృద్ధికి కృషి

- రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో నిర్మించనున్న 33 కేవీ విద్యుత్ సబ్స్టేషన్కు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సబ్స్టేషన్ ఏర్పాటుకు భూమి కేటాయింపు విషయంలో కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గ్రామ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ సహకారంతో నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామానికి 38 సామాజిక భద్రత పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లతో సీబీఎస్ఈ, రెసిడెన్షియల్ విద్యా సదుపాయాలతో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

**రహదారులు, మౌళిక వసతులకు ప్రాధాన్యం..**

ఎమ్మెల్యే కాలనీ నుంచి ఆర్కే-5 వరకు 4.7 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.4.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. గ్రామంలోని అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జర్మన్ భాషలో ఇప్పటికే సుమారు 70 మంది యువతకు శిక్షణ కొనసాగుతోందని తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నస్పూర్ మండల కేంద్రంలో జరిగిన రహదారి ప్రమాదంలో వెంకటాపూర్ గ్రామస్థులు మృతి చెందడంతో మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 24 వార్డులకు సంబంధించి సుమారు రూ.15 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో మరో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, సీసీ మురుగు కాలువల నిర్మాణంతో పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను మెరుగుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ బానోత్ రాజన్న, మండల తహశీల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# హర్మన్‌ప్రీత్ సేవలు మరువలేం

## స్మృతి మంధాన భావోద్వేగ పోస్టు..

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 :** భారత మహిళా క్రికెట్ జట్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జింబాబ్వే సిరీస్‌కు ముందు జట్టు రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీకి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధానను కొత్త కెప్టెన్‌గా బీసీసీఐ నియమించింది. గువాహటిలో జరిగిన బీసీసీఐ సమీక్ష సమావేశం తర్వాత హర్మన్‌ప్రీత్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్మృతి మంధాన మాజీ కెప్టెన్ గురించి సోషల్ మీడియా వేదికగా భావోద్వేగపూరితమైన పోస్టు చేశారు. తమ దశాబ్ద కాలపు నాయకత్వంలో హర్మన్‌ప్రీత్ దేశానికి అద్భుత విజయాలను అందించారని మంధాన కొనియాడారు. నవంబర్ 2025లో తొలి వన్డే ప్రపంచ కప్‌తో పాటు 2023, 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిపెట్టడంలో ఆమె పాత్ర గొప్పదని ప్రశంసించారు. ఆట పట్ల ఉన్న మళ్లీ కేవలం ప్రేమ, అభిరుచితోనే ఆడాలని భావిస్తున్నట్లు హర్మన్‌ప్రీత్ తెలిపారు. కెప్టెన్‌గా తప్పుకున్నప్పటికీ, ఆమె జింబాబ్వే సిరీస్‌కు ఎంపికైన జట్టులో కొనసాగనున్నారు. మరోవైపు, గాయంతో జట్టుకు దూరంగా ఉన్న జెమిమా రోడ్రిగ్స్ కూడా హర్మన్‌ప్రీత్ సేవలలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల చివర్లో జింబాబ్వేతో జరిగే దేశీయ టీ20, వన్డే సిరీస్‌ల ద్వారా స్మృతి మంధాన పూర్తి స్థాయి కెప్టెన్‌గా తన బాధ్యతలను ప్రారంభించనున్నారు.

# తన్మయ్ స్పిన్ సునామీ

## యూత్ టెస్టులో ప్రపంచ రికార్డు నెలకొల్పిన తన్మయ్ బలోడా

**అహ్మదాబాద్, అక్టోబర్ 7 :** ఆఖరి నిమిషంలో జట్టులో చోటు.. అవకాశం వచ్చిందని బరిలోకి దిగాడు.. స్పిన్‌తో ఆసీస్‌ను చుట్టేశాడు.. ఏకంగా 19 ఏళ్ల ప్రపంచ రికార్డునే తిరగరాశాడు! భారత అండర్-19 యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా అద్భుత ప్రదర్శనతో యూత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో యూత్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 73 పరుగులిచ్చి 14 వికెట్లు పడగొట్టి యూత్ టెస్టు చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. రోహిత్ యాదవ్ స్థానంలో ఆఖరి నిమిషంలో జట్టులోకి వచ్చిన తన్మయ్.. వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి ఎనిమిది వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 14 వికెట్లు సాధించి ఆస్ట్రేలియా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు న్యూజిలాండ్ స్టార్ పేసర్ టిమ్ సౌథీ పేరిట ఉండేది. 2007లో భారత అండర్-19 జట్టుతో జరిగిన యూత్ టెస్టులో సౌథీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 92 పరుగులిచ్చి 12 వికెట్లు పడగొట్టాడు. తాజాగా తన్మయ్ 73 పరుగులకే 14 వికెట్లు పడగొట్టి ఆ 19 ఏళ్ల రికార్డును అధిగమించాడు. తన్మయ్ స్పిన్ ధాటికి ఆస్ట్రేలియా బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తడబడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకు ఆలౌటైన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులకే పరిమితమైంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 315 పరుగులు చేయడంతో విజయానికి కేవలం 11 పరుగుల లక్ష్యం మాత్రమే మిగిలింది. స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన భారత ఓపెనర్లు తొలి ఓవర్‌లోనే రెండు బౌండరీలు బాది విజయాన్ని ఖాయం చేశారు. దీంతో భారత్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతోపాటు రెండు మ్యాచ్‌ల యూత్ టెస్టు సిరీస్‌ను 2--0తో క్లీన్‌స్వీప్ చేసింది.



# మ్యాచ్ వేళ.. స్టేడియానికి బాంబు బెదిరింపు!

- అహ్మదాబాద్‌లో కలకలం.. స్టేడియంతోపాటు పది పాఠశాలలకు బెదిరింపు మెయిల్స్
- స్టేడియంలోనే భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్లు.. అప్రమత్తమైన అధికారులు
- పాఠశాలల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించిన యాజమాన్యాలు
- బాంబు నిర్వీర్య బృందాలతో విస్తృత తనిఖీలు.. రంగంలోకి సైబర్ క్రైమ్ పోలీసులు
- దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని ప్రస్తావిస్తూ బెదిరింపులు



**అహ్మదాబాద్, అక్టోబర్ 7 :** భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మ్యాచ్ జరుగుతున్న వేళ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. స్టేడియంతోపాటు నగరంలోని పది ప్రముఖ పాఠశాలలను పేల్చేస్తామంటూ ఈమెయిల్ సందేశాలు రావడంతో పోలీసులు, భద్రతా బలగాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపించగా.. బాంబు నిర్వీర్య బృందాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపట్టాయి. ముఖ్యంగా పశ్చిమ అహ్మదాబాద్‌లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆయా పాఠశాలల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వారిని వేగంగా ఇళ్లకు పంపించారు. బెదిరింపులు వచ్చిన సమయంలో నరేంద్ర మోదీ స్టేడియం ప్రాంగణంలో భారత అండర్-19, ఆస్ట్రేలియా అండర్-19 జట్లు ఉండటంతో ఆందోళన మరింత పెరిగింది. ఉదయం 11.15 గంటలకే యూత్ టెస్ట్ మ్యాచ్ ముగియగా, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత క్రీడాకారులు క్షేమంగా తమ బసకు బయలుదేరి వెళ్లారు. నవంబర్ 21న ఇదే స్టేడియంలో జరగనున్న ప్రముఖ గాయకుడు దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని కూడా బెదిరింపు ఈమెయిల్స్‌లో ప్రస్తావించినట్లు సమాచారం. ఆ కార్యక్రమానికి హాజరయ్యే వారికి రక్షణ ఉండదంటూ హెచ్చరికలు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బెదిరింపుల సమాచారం అందుకున్న గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ పటేల్ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాంబు నిర్వీర్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు స్టేడియం సహా బెదిరింపులు వచ్చిన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు బెదిరింపు ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయి?.. వాటిని పంపింది ఎవరు?.. దీని వెనుక ఉద్దేశమేంటి? అనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో శ్రేయాస్ అయ్యర్ ధమాకా

## టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు!



**దుబాయ్, అక్టోబర్ 07 :** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన పురుషుల టీ20, వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు అత్యుత్తమ స్థానాల్లో నిలిచి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. లక్నో వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు సాధించిన భారత టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సుదీర్ఘ లీప్ తీసుకున్నారు. ఈ విధ్వంసక సెంచరీతో ఏకంగా 18 స్థానాలు ఎగబాకిన అయ్యర్, తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా 7వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానాన్ని, తిలక్ వర్మ 10వ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయ్యర్ 7వ స్థానానికి రావడంతో ఐసీసీ టాప్-10 టీ20 బ్యాటర్లలో ఏకంగా నలుగురు భారతీయులే ఆక్రమించడం విశేషం. మరోవైపు, ఏషియన్ గేమ్స్ 2026లో రాణించిన 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 8 స్థానాలు మెరుగుపరుచుకుని 46వ ర్యాంక్‌కు చేరగా, పాకిస్థాన్‌కు చెందిన హసన్ నవాజ్ 62 స్థానాలు ఎగబాకి 48వ స్థానంలో నిలిచారు. టీ20 బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకోగా, భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ 16 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. ఇక వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. గువాహటిలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసి కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీ సాధించిన గిల్, తన కెరీర్ బెస్ట్ 841 రేటింగ్ పాయింట్లను సమం చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మూడో స్థానానికి పడిపోగా, మూడో వన్డేలో శతకం బాదిన కేఎల్ రాహుల్ 7 స్థానాలు ఎగబాకి తిరిగి టాప్-10లోకి అడుగుపెట్టాడు. వెస్టిండీస్‌తో జరిగిన ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో గెలుచుకుంది.

# టీమ్ ఎంపికలో ఇక 'లక్ష్మణ్' ముద్ర!

## బీసీసీఐ కీలక నిర్ణయం.. ప్రతి సీనియర్ సెలెక్షన్ సమావేశానికి వీవీఎస్ లక్ష్మణ్

## ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్, పునరావాసంపై సెలెక్టర్లకు నేరుగా సమాచారం

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్--సెలెక్షన్ కమిటీ మధ్య సమన్వయానికి కొత్త అడుగు



**ముంబై, అక్టోబర్ 7 :** టీమిండియా ఎంపిక ప్రక్రియలో హైదరాబాద్ దిగ్గజం వీవీఎస్ లక్ష్మణ్‌కు కీలక పాత్ర దక్కనుంది. ఇకపై సీనియర్ సెలెక్షన్ కమిటీ నిర్వహించే ప్రతి సమావేశానికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతిగా ఉన్న లక్ష్మణ్ హాజరుకానున్నారు. ముఖ్యంగా ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్, పునరావాసం, తిరిగి జట్టుకు అందుబాటులోకి వచ్చే సమయం వంటి అంశాలపై సెలెక్టర్లకు కచ్చితమైన సమాచారం అందించేందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల గువాహటిలో




జరిగిన టీ20, ఇండియా-ఏ జట్ల ఎంపిక సమావేశాల్లోనూ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఇకపై సీనియర్ జట్టు ఎంపిక సమావేశాల్లో ఆయన క్రమం తప్పకుండా భాగస్వామి కానున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆటగాళ్ల ఫిట్‌నెస్, గాయాలు, పునరావాస ప్రక్రియను పర్యవేక్షించే వ్యవస్థకు లక్ష్మణ్ నేతృత్వం వహిస్తున్న నేపథ్యంలో ఆయన నుంచి నేరుగా సమాచారం పొందడం సెలెక్టర్లకు ఉపయోగపడుతుందని బీసీసీఐ భావిస్తోంది. గాయపడిన ఆటగాడు ఎప్పుడు కోలుకుంటాడు?.. జట్టు ఎంపిక సమయానికి అందుబాటులో ఉంటాడా?.. అతడి ప్రస్తుత ఫిట్‌నెస్ పరిస్థితి ఏంటి?.. పునరావాస ప్రక్రియ ఎంతవరకు వచ్చింది?.. వంటి అంశాలపై ఇకపై సెలెక్షన్ సమావేశంలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. లక్ష్మణ్ నేరుగా సమావేశాల్లో పాల్గొనడం ద్వారా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సెలెక్టర్ల మధ్య సమాచార లోపాలకు అవకాశం లేకుండా చూడాలన్నది బోర్డు ఉద్దేశం. మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హయాంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సెలెక్షన్ కమిటీ మధ్య సమాచార సమన్వయంలో కొన్ని సమస్యలు ఎదురైనట్లు సమాచారం. ముఖ్యంగా గాయపడిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, తిరిగి అందుబాటులోకి వచ్చే సమయంపై సెలెక్టర్లకు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందని సందర్భాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవస్థలో సమన్వయాన్ని పెంచేందుకు తాజా మార్పు చేసినట్లు చెబుతున్నారు. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సైతం ఈ నిర్ణయంపై స్పష్టత ఇచ్చారు. ముంబైలో జరిగిన సమీక్ష సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సీఓఈ అధిపతిగా ఉన్న లక్ష్మణ్ ఇకపై అన్ని సీనియర్ సెలెక్షన్ సమావేశాలకు హాజరై సెలెక్టర్లకు అవసరమైన సమాచారం అందిస్తారని పేర్కొన్నారు. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్ బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మార్పుల నేపథ్యంలో జట్టు ఎంపిక వ్యవస్థలోనూ బీసీసీఐ పలు కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది.



# నన్ను సరిగ్గా అంచనా వేయక..

## తక్కువ సినిమాలు చేయడానికి కారణం చెప్పిన శ్రీనిధి శెట్టి

**హైదరాబాద్, అక్టోబర్ 7 :** 'కేజీఎఫ్'తో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నా.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేకపోవడానికి కారణమేంటో నటి శ్రీనిధి శెట్టి వెల్లడించారు. తాను కావాలనే సినిమాల సంఖ్య తగ్గించుకోవడం లేదని, మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగైదు చిత్రాల్లో నటించేందుకు కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. తన టైమింగ్ కలిసి రాకపోవడం లేదా మేకర్స్ తన సామర్థ్యాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమోనని అభిప్రాయపడ్డారు. వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'లో ప్రస్తుతం శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాల ఎంపిక గురించి ఆమె ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "గత కొన్నేళ్లుగా నేను చాలా తక్కువ సినిమాలు చేస్తున్నానని అందరూ నన్ను సెలక్టివ్ అనుకుంటున్నారు. నిజానికి కెమెరా ముందు నటించడమంటే నాకు చాలా ఇష్టం. మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా సిద్ధమే. అయితే మంచి కథతోపాటు ఆసక్తికరమైన టీమ్ కుదరాలి" అని శ్రీనిధి చెప్పారు. కొన్నిసార్లు తనకు సరైన సమయంలో సరైన అవకాశాలు రాలేదేమోనని అనిపిస్తుందని తెలిపారు. "నా టైమింగ్ బాగోలేకపోవడం కావచ్చు.. లేదా మేకర్స్ నన్ను సరిగ్గా అంచనా వేయలేకపోవడం కావచ్చు. అందుకే అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమో. ఒక్కోసారి నేను మంచి నటిని కాదేమో.. అందుకే అవకాశాలు ఇవ్వడం లేదేమో అనే ఆలోచన కూడా వస్తుంది" అని పేర్కొన్నారు. తన గురించి తాను ఎప్పుడూ అతిగా ఊహించుకోనని, వాస్తవానికి దగ్గరగా ఉండేందుకే ప్రయత్నిస్తానన్నారు. కొత్త దర్శకుడైనా, అగ్ర దర్శకుడైనా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతతో ఉంటానని చెప్పారు. సినిమాపై ఉన్న అభిరుచితోనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వెంకటేష్-త్రివిక్రమ్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' గురించి శ్రీనిధి ప్రత్యేకంగా స్పందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో తనకు అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని, ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.





# నా డ్రెస్‌పై ప్రైమ్‌టైమ్ డిబేటా నమ్మలేకపోయా!

## రక్షాబంధన్ యాడ్ వివాదంపై కృతి సనన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ముంబై, అక్టోబర్ 7 :** "నా దుస్తుల గురించి ఏకంగా ఆరుగురు వ్యక్తులు కూర్చొని చర్చించడం చూసి షాకయ్యా. అసలు అది జరుగుతోందంటేనే నమ్మలేకపోయా" అంటూ బాలీవుడ్ నటి కృతి సనన్ గతంలో తన రక్షాబంధన్ ప్రకటన చుట్టూ తలెత్తిన వివాదాన్ని గుర్తుచేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో మొదలైన విమర్శలు చివరకు టీవీ చానళ్లలో ప్రైమ్‌టైమ్ చర్చల వరకు వెళ్లడం తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచిందని చెప్పారు.కరీనా కపూర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' ఆరో సీజన్‌లో పాల్గొన్న కృతి.. తనపై గతంలో వచ్చిన విమర్శల గురించి మాట్లాడారు. రక్షాబంధన్‌కు సంబంధించిన ఓ ప్రకటనలో తాను ధరించిన దుస్తులపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయని, వివాదం ముదరడంతో చివరకు సంబంధిత సంస్థ ఆ ప్రకటనను తొలగించిందని గుర్తుచేశారు. "నా డ్రెస్ అంత పెద్ద వివాదానికి కారణమవుతుందని అస్సలు అనుకోలేదు. సామాజిక మాధ్యమాల్లో విమర్శలు రావడం ఒక ఎత్తయితే.. టీవీలో ఆరుగురు సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేసి నా దుస్తులపై చర్చించడం మరో ఎత్తు. అది చూసి నిజంగానే షాకయ్యా" అని కృతి వ్యాఖ్యానించారు. మహిళలు ఏం ధరించాలి? ఎలా కనిపించాలి? ఎలా ప్రవర్తించాలి? అనే విషయాల్లో ఇతరులు నిరంతరం తీర్పులు ఇవ్వడం మానుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మహిళలు ప్రధానంగా కోరుకునేది ఏమిటన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "ఇతరులను అనవసరంగా జడ్జ్ చేయడం ఆపేయండి. ఎవరి పని వారు చూసుకుంటే చాలు" అని పేర్కొన్నారు. మహిళల వస్త్రధారణకు హద్దులు నిర్ణయించడం, వారి వ్యక్తిగత ఎంపికలపై ఇతరులు తీర్పులు ఇవ్వడం వంటి ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్న కృతి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# మాధురి రాథోడ్ మళ్లీ జోరు..

## కొత్త ఫోక్ సాంగ్‌తో కమ్‌బ్యాక్



**హైదరాబాద్, అక్టోబరు 7 :** 'నిమ్మ తోట వనములో', 'సీటీ చీర', 'బాసింగ బలాలే' వంటి జానపద పాటలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ఆమె మోడల్‌గా, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తగా, ముఖ్యంగా జానపద నృత్యకారిణిగా మంచి పేరు సంపాదించుకుంది. తాజాగా 'బిందెలు బిందెలు బావయ్యో' అనే కొత్త జానపద పాటతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'బిందెలు బిందెలు బావయ్యో' పాటకు సంబంధించిన ప్రచార దృశ్యాలను తాజాగా విడుదల చేశారు. ఎప్పటిలాగే మాధురి రాథోడ్ తనదైన మాస్ ఎనర్జీతో స్టెప్పులు వేసి ఆకట్టుకుంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. యూట్యూబ్‌తో పాటు ఇతర వేదికల్లోనూ ఈ పాటకు మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవల మాధురి రాథోడ్, ఆమెతో కలిసి పనిచేసిన నృత్యకారుడు ఈశ్వర్ సాయి వ్యక్తిగత వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనల నేపథ్యంలో ఇద్దరి కెరీర్ దెబ్బతింటుందని పలువురు భావించారు. అయితే ఈశ్వర్ సాయి కూడా ఇటీవల తన కొత్త పాటకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించి, వృత్తిపరంగా మళ్లీ బిజీ అవుతాననే ధీమా వ్యక్తం చేశాడు. తాజాగా మాధురి కూడా కొత్త పాటతో ప్రేక్షకుల ముందుకు రావడంతో ఇద్దరూ తమ కళారంగ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ జోడీకి జానపద పాటల్లో మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'రాతిరి రాతిరి రాతిరిలో', 'సీటీ చీర', 'సన్న సన్న బియ్యమే', 'ప్రమీల ప్రమీల', 'కళ్లకు కాటుక దిద్దినారో', 'అది అబ్బబ్బాగా పోరి', 'లాయి లాయి లబ్బరు బొమ్మ', 'బాసింగా బలాలే' వంటి పాటలు యూట్యూబ్‌లో భారీగా వీక్షణలు సాధించాయి. దీంతో కొత్తగా వచ్చిన 'బిందెలు బిందెలు బావయ్యో' పాటపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# 'నా వైఫ్ మిస్సింగ్'.. అసలు ఆమెకు ఏమైంది?

## ఊహించని మలుపులతో ఉత్కంఠ రేపుతున్న టీజర్

**హైదరాబాద్, అక్టోబర్ 7 :** భార్య కనిపించడం లేదంటూ ఓ భర్త పోలీస్ స్టేషన్‌కు వెళ్తాడు.. కానీ ఆమె నిజంగానే అదృశ్యమైందా? ఇంటి నుంచి వెళ్లిపోయిందా? ఆమెకు ఏదైనా జరిగిందా? లేక ఈ కథ వెనుక భర్తకే తెలియని రహస్యం ఉందా?.. ఇలా వరుస ప్రశ్నలు రేకెత్తిస్తూ 'నా వైఫ్ మిస్సింగ్' టీజర్ ఆసక్తి పెంచుతోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ అక్టోబర్ 22 నుంచి 'ఆహా'లో ప్రసారం కానుంది. 'కొత్త బంగారు లోకం'తో యువత మనసులు గెలుచుకున్న వరుణ్ సందేశ్-శ్వేతా బసు ప్రసాద్ జోడీ దాదాపు 18 ఏళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే ఈసారి ప్రేమ కథతో కాకుండా సస్పెన్స్, మిస్టరీతో నిండిన వెబ్ సిరీస్‌తో అలరించేందుకు సిద్ధమైంది. 'నా వైఫ్ మిస్సింగ్'లో వరుణ్ సందేశ్ సాధారణ బ్యాంకు ఉద్యోగి 'బాలు' పాత్రలో కనిపించనుండగా, ఆయన భార్య పాత్రను శ్వేతా బసు ప్రసాద్ పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో పెళ్లి తర్వాత తన భార్య కనిపించడం లేదంటూ బాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కథకు కీలక మలుపుగా కనిపిస్తోంది. అక్కడి నుంచే అసలు ఉత్కంఠ మొదలవుతుంది. ఆమెకు ఏమైంది? స్వచ్ఛందంగా వెళ్లిపోయిందా? ఏదైనా ప్రమాదం జరిగిందా? ఈ వ్యవహారంలో భర్త పాత్ర ఏంటి?.. అనే అనుమానాలను టీజర్ రేకెత్తిస్తోంది. ఊహించని మలుపులతో కథను నడిపించనున్నట్లు టీజర్ సంకేతాలిస్తోంది. 'అనుమానం.. అవమానం.. అవకాశం..' అనే ఆసక్తికరమైన ప్రచార వాక్యంతో వస్తున్న ఈ సిరీస్‌ను తెలుగు, తమిళ భాషల్లో అక్టోబర్ 22 నుంచి ప్రసారం చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com